క్లుప్తంగా

గిద్దలూరుకు దూపాడు నీరివ్వలేం

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: గిద్దలూరులో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రామన్నకతువ నుంచి నీటిని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో దూపాడు నుంచి సాగర్ నీటిని తెచ్చేందుకు ప్రతిపాదించారని, అయితే అందుకు డబ్బు ఎక్కువగా ఖర్చవుతుందని చెప్పుకొచ్చారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుదామన్నారు. నూతన మున్సిపల్ కౌన్సిల్ హాల్ నిర్మాణం త్వరలోనే చేపడతామన్నారు. పారిశుధ్య పనుల్లో జాప్యం చేయొద్దని సూచించారు. సమావేశంలో చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ డి.వెంకటదాసు, కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులు పంపిణీ


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శేఖర్

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ సమీపంలోని భావనారుషి ఆలయంలో భారత సేవాసమితి, లక్ష్మీ కళ్యాణి మెడికల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. పిటికాయగుళ్ల ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి కనిగిరి శేఖర్ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ సీహెచ్ మాధవకృష్ణారావు, నిర్వాహకులు పి.పవన్‌కుమార్, పాండురంగారెడ్డి, నర్రా బసిరెడ్డి, పూనూరు గురువారెడ్డి, కె.రమణారెడ్డి, ఆకుల చక్రపాణి, జక్కా బాబు పాల్గొన్నారు.

గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు మృతి

పొదిలి: పొదిలి నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న యువకుడు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక నేతపాలేనికి చెందిన కిరణ్ శుక్రవారం పారిశుధ్య పనులు చేస్తుండగా తీవ్రమైన గుండె నొప్పితో బాధపడ్డాడు. తోటి కార్మికులు, స్థానికులు స్పందించి ఒంగోలులోని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో కిరణ్ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

పొదిలి రూరల్: విధి నిర్వహణలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించాలని చెప్పారు. ప్రజలను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల రొద.. జనం వ్యథ

పదే పదే వేధిస్తున్న సమస్యలతో జనం విసిగివేసారిపోతున్నారు. రాళ్లు తేలిన రహదారులు వాహనదారుల రక్తం కళ్లజూస్తుంటే, మురుగు, తాగునీటి సమస్యలు ప్రజలకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. సమస్యల పరిష్కారంపై పాలకులు దృష్టి సారించకపోవడంతో నెలల తరబడి జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో ప్రజలు పడుతున్న కష్టాలపై 'సాక్షి' ఫోకస్..


బేస్తవారిపేట : ఎర్త్‌వర్క్ చేసేటప్పుడు పగిలిన పైపులైన్


బేస్తవారిపేటలో రోడ్డుకు ఇరువైపులా తీసిన గుంతల్లో నిలిచిన నీరు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు సీసీ రోడ్డు విస్తరణ పనులు ప్రజలకు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. ఇరువైపులా ఒకేసారి గుంతలు తీయడంతో జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. వారం రోజులు దాటినా ఎర్త్‌వర్క్, సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఎర్త్‌వర్క్ కోసం మట్టి తీసేటప్పుడు గృహాల ముందు కొన్ని చోట్ల మంచినీటి కుళాయిల పైపులు పగిలిపోయాయి, అంతేకాకుండా గుంతల్లోకి పక్కనున్న డ్రైనేజీ ఊట చేరింది. కనీసం గృహాల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కార్లు, స్కూల్ బస్‌లు, ట్రాక్టర్ల రాకపోకల సమయంలో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే మార్జిన్ లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు.

☛ రోడ్డు మార్జిన్‌లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసేందుకు నిర్మించిన పైపులైన్ తరచూ పగిలిపోవడం లేదా లీకులు ఏర్పడుతుండటం సమస్యగా మారింది. ఇప్పటికి 40 పర్యాయాలు పలుచోట్ల లీకులు ఏర్పడటంతో పంచాయతీ సిబ్బంది కుస్తీలు పడుతున్నారు. ఎర్త్‌వర్క్ సమయంలో పైపులు మళ్లీ పగిలిపోయాయి. సీసీ రోడ్డు నిర్మాణ సమయంలోనే కొత్త పైపులైన్ వేస్తే భవిష్యత్‌లో సమస్య లేకుండా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

త్రిపురాపురంలో తాగు నీరు వృథా

గిద్దలూరు రూరల్: మండలంలోని తంబళ్లపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో గల త్రిపురాపురంలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. జలజీవన్ మిషన్‌లో భాగంగా కుళాయిల ఏర్పాటు కోసం ప్రధాన పైపులకు రంధ్రాలు వేసి వదిలేయడం, పైప్‌లైన్‌కు తరచూ లీకేజీలు ఏర్పడుతుండటంతో తాగునీరు వృథా అవుతోంది. పైప్‌లైన్‌ను సీసీ రోడ్డుపైనే ఏర్పాటు చేయడంతో రాకపోకలకూ ఇబ్బందికరంగా మారింది. ప్రణాళిక లేకుండా పనులు చేయడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


కుళాయి రంధ్రం నుంచి వృథాగా పోతున్న నీరు


సీసీ రోడ్డుపై ప్రవహిస్తున్న మంచినీరు


సిమెంట్ రోడ్డుపై అడ్డంగా పైపులు


రాచర్ల : ప్రమాదకరంగా ఉన్న అంకిరెడ్డిపల్లె రోడ్డు

ప్రయాణం.. ఇక్కట్లమయం

● పల్లె దారుల్లో అడుగడుగునా గోతులు ● మరమ్మతులు చేయించడంలో పాలకుల అశ్రద్ధ

కొమరోలు/రాచర్ల: 'రహదారుల మరమ్మతులకు నిధులొచ్చేశాయ్.. ఇకపై ప్రయాణం సాఫీగా చేయవచ్చు' అని రెండు నెలల క్రితం కూటమి నాయకులు చేసిన ప్రచారం అంతా డొల్లేనని జనం విమర్శలు సంధిస్తున్నారు. కొమరోలు మండలంలోని సూరవారిపల్లె గ్రామానికి వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలమయంగా మారింది. గోపాలునిపల్లె దాటిన వెంటనే తారు రోడ్డు దెబ్బతింది. సూరవారిపల్లి, బొడ్డువానిపల్లి, మొట్టుపల్లె, పోసుపల్లె గ్రామాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రాచర్ల మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా ఉంది. దద్దవాడ క్రాస్ రోడ్డు నుంచి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న అంకిరెడ్డిపల్లె గ్రామానికి ఆరు నెలల క్రితం తారు రోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో పాత రోడ్డును తొలగించి, గ్రానైట్ చిప్స్ వేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ఆ పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. ఫలితంగా గ్రామస్తులు ఈ మార్గంలో ప్రయాణించే సమయంలో నరక యాతన అనుభవిస్తున్నారు. కంకర రోడ్డుపై బైకులు అదుపుతప్పి పడిపోతున్నాయని, అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.


కొమరోలు : గుంతలమయంగా మారిన సూరవారిపల్లె రోడ్డు(ఇన్‌సెట్‌లో) దెబ్బతిన్న రోడ్డు



ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తున్నా పట్టించుకోరా?

● అక్రమణదారులపై చర్యలు తీసుకోకుంటే ప్రజా ఉద్యమానికి వెనుకాడం
● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పానుగంటి షాలెంరాజు


మాట్లాడుతున్న షాలెంరాజు

కంభం: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోకుంటే ప్రజా ఉద్యమం చేయడానికైనా వెనుకాడబోమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పానుగంటి షాలెంరాజు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు మండలాల్లో పలు చోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బేస్తవారిపేట మండలంలోని చింతలపాలెం రెవెన్యూలో సర్వే నంబర్ 250లో 14 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైందన్నారు. అందులో కొంత భూమిని కొందరు అక్రమంగా రిజిస్టర్ చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నా బేస్తవారిపేట తహసీల్దార్ చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సబ్ కలెక్టర్ సైతం సదరు స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ భూమేనని పేర్కొంటూ నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించినా చర్యలు తీసుకోలేదన్నారు. కంభంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి స్థలం లేక ప్రయాణికులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారని, అదే విధంగా ఈ ప్రాంతంలో కోర్టు నిర్మాణం అవసరం ఎంతైనా ఉందని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

కంభం మండలం కందులాపురం పంచాయతీలోని నల్లవాగు సమీపంలో సర్వే నంబర్ 650లో వాగు స్థలాన్ని ఆక్రమించి షెడ్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. పేదలు చిన్న గుడిసెలు వేసుకుంటే ధ్వంసం చేస్తున్న అధికారులు.. బడా నేతలు ఆక్రమణలకు పాల్పడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నేదరపల్లి జయరాజ్, గోన మోహన్‌రావు, బీసీ నాయకులు వేముల రాజు, స్వైరో జిల్లా నాయకులు శీలం వినోద్, ఎస్టీ సంఘ నాయకుడు బ్రహ్మయ్య, రవి, బాబ్జి, మణి, ఏసు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధికి ప్రత్యామ్నాయం చూపాలి

● సబ్ కలెక్టరేట్ ఎదుట చిరు వ్యాపారుల ధర్నా


ఏఎస్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న చిరువ్యాపారులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఇటీవల ఆక్రమణల పేరుతో చిరువ్యాపారుల బంకులు, బండ్లు తొలగించారని, ఇప్పటికి 20 రోజులైనా వారికి ప్రత్యామ్నాయం చూపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని రైతు సంఘం నేత గాలి వెంకటరామిరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు కొంతమందికి మాత్రమే ప్రత్యామ్నాయం చూపారని, కంభం రోడ్డు, కాలేజీ రోడ్డు, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో చాలా మందికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపకపోవడంతో వ్యాపారాలు లేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరువ్యాపారులకు జీవనోపాధి చూపాలని ఇప్పటి వరకు మూడుసార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పట్టణంలో ఒంగోలు వెళ్లేవారి కోసం ఒక బస్టాండ్, విజయవాడ, శ్రీశైలం వెళ్లేవారి కోసం మరో బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఎస్ఓ చెంచిరెడ్డికి వినతిపత్రం అందించారు.

రేపు యాదవ కార్తీక వనభోజన మహోత్సవం


వన భోజన మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

కొనకనమిట్ల: కొత్తపట్నం సమీపంలోని నల్లూరి గార్డెన్స్‌లో ఆదివారం జిల్లా యాదవ కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ నాయకుడు రాచగొర్ల వెంకట్రావుయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గొట్లగట్టు గ్రామంలో యాదవ సంఘ నాయకులతో నిర్వహించిన సమావేశంలో వన భోజన మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా యాదవ నాయకులు హాజరవుతున్నారని చెప్పారు. యాదవ సామాజికవర్గీయులు కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘ నాయకులు చల్లా లక్ష్మీనారాయణయాదవ్, గోళ్ల వెంకటేశ్వర్లుయాదవ్, నాగేశ్వరరావుయాదవ్, సుబ్బారావుయాదవ్, రామకృష్ణయాదవ్, కొనకనమిట్ల మండల నాయకులు మోరబోయిన బాబూరావుయాదవ్, కందెర నాసరయ్యయాదవ్, ఈర్ల బాలవెంకటేశ్వర్లుయాదవ్, మోరబోయిన ప్రసాద్‌యాదవ్, బయ్యా నాగేశ్వరరావు యాదవ్, చావలి మురళీకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు అమ్మితే చర్యలు


ఎరువుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఏఓ

తర్లుపాడు: ఎరువులు, పురుగుమందులు ఎమ్మార్పీని మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని పోతలపాడు, తర్లుపాడులోని ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. సాయి శ్రీనివాస ఏజెన్సీలో ఫారం 0 లేకపోవడంతో రూ.1,54,850 విలువైన ఎరువులను నిలుపుదల చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అనుమతి కలిగిన జీ2, జీ3 బయో మందులనే విక్రయించాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో 30 టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు.

7న మెగా పేరెంట్స్, టీచర్స్ డే

కంభం: మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని డిసెంబర్ 7న పండగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ మాల్యాద్రి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమ నిర్వహణపై ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ఎంఈఓ-2 శ్రీనివాసులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పద్మావతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఏకపక్షంగా ఆక్రమణల తొలగింపు

● మార్కాపురం మున్సిపల్ అధికారుల తీరును తప్పుబట్టిన కౌన్సిల్ సభ్యులు
● అడ్డగోలు కూల్చివేతలతో వందలాది మంది రోడ్డున పడ్డారని ఆవేదన
● చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్
● రాజకీయ నేతల కనుసన్నల్లో పనిచేయొద్దని అధికారులకు హితవు
● పార్కు స్థలంలో కొందరికి అవకాశమిస్తే సరిపోతుందా అని ప్రశ్న


మాట్లాడుతున్న చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ


ఆక్రమణల తొలగింపుపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు కనకదుర్గ, కృష్ణా, సిరాజ్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా మున్సిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించారని, కనీసం కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించడం ఏమిటని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. ఆక్రమణల తొలగింపుతో వందలాది మంది ఉపాధి కోల్పోయారని, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, కొత్త కృష్ణ, సిరాజ్ మాట్లాడుతూ.. పట్టణంలో ఆక్రమణల తొలగింపులో రాజకీయ నాయకుల జోక్యం మితిమీరిందని, కౌన్సిల్‌కు కనీసం సమాచారం ఇవ్వకుండా ఆక్రమణలు ఎలా తొలగించారని కమిషనర్ నారాయణరావును ప్రశ్నించారు. కేవలం డీఎస్పీ, సీఐ, కమిషనర్ మాత్రమే పట్టణంలో పర్యటించి ఆక్రమణలపై సమీక్షించడం ఎంతవరకు సబబని నిలదీశారు. ఆక్రమణల తొలగింపుతో ఏర్పడిన వ్యర్థాలను తొలగించేందుకు అవసరమైన నిధులకు మాత్రం కౌన్సిల్ ఆమోదం కావాలా అని ప్రశ్నించారు. ఆక్రమణల తొలగింపుతో వందలాది మంది ఉపాధి కోల్పోయారని, కొందరికి మాత్రమే పార్కు స్థలంలో ఉపాధి చూపితే మిగిలిన వారి పరిస్థితి ఏమిటో చెప్పాలన్నారు. పట్టణంలో ఫాగింగ్ నిర్వహించకపోవడంతో దోమల ఉధృతితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ చిన్న పెద్దావలి చైర్మన్ దృష్టికి తెచ్చారు. పురపాలక సంఘం పరిధిలో అసలు ఎన్ని ఫాగింగ్ మిషన్లు, ఎక్కడెక్కడ వినియోగిస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ.. రెండు రిపేరులో ఉన్నాయని, ప్రస్తుతం మూడు మిషన్లతో ఫాగింగ్ చేయిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఆటోలకు పురపాలక సంఘం తరఫున మరమ్మతులు చేయించడం ఏమిటని, వారంటీతో సదరు సంస్థ రిపేర్ చేస్తుంది కదా అని సభ దృష్టికి తెచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. ప్రస్తుతం పురపాలక సంఘంలో 21 ఈ ఆటోల్లో 15 రిపేరుకు వచ్చాయని, అప్పటి వరకు రెండు ప్రవేటు ట్రాక్టర్లను తీసుకుని పారిశుధ్య పనులు చేయిస్తున్నామని తెలిపారు. ఈ ఆటోలకు కంపెనీ ఇచ్చిన వారంటీ కాలం ముగిసిందని చెప్పారు. పట్టణంలోని ఇతర సమస్యలపై కౌన్సిలర్లు చర్చించారు. సమావేశంలో మేనేజర్ శ్రీనివాసన్, డీఈ శ్రీనివాసులు, ఏఈలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కేదారేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నా పూజలు


అభిషేక పూజలు చేస్తున్న అన్నా దంపతులు

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి గ్రామంలో ప్రఖ్యాత శైవ క్షేత్రమై కేదారేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో అర్చకులు అభిషేకాలు చేయించి, ఆశీర్వచనం అందజేశారు. తర్లుపాడులోని నీలకంఠేశ్వర ఆలయంలోనూ అన్నా దంపతులు పూజలు చేశారు. వారి వెంట స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.